క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కామదహనం..



కామదహన పూజలు

పాలకొండ రూరల్: హోలీ పౌర్ణమి వేడుకల్లో భాగంగా బుధవారం స్థానిక జగన్నాథస్వామి ఆలయ పరిసరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో అర్చకుడు మతం విశ్వనాథదాసు కామదహన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. ఏటా ఆనవాయితీగా చేపడుతున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పెయింటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



నగదు బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

సీతంపేట: గిరిజన స్వాభిమాన్ వేడుకల్లో భాగంగా విశాఖపట్నంలో బుధవారం నిర్వహించిన పెయింటింగ్, ఆర్ట్ కాంపిటేషన్‌లో సీతంపేట ఐటీడీఏ పరిధి విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు సీఎంఓ చిరంజీవులు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. నిర్వాహకులు అందించిన ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులను విజేతలు ఎస్.నిర్మల, ఎస్. లావణ్య, తదితరులకు ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి అభినందించారు.

త్వరితగతిన పెండింగ్ పనులు

వీరఘట్టం: పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లు, పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు పనులు త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే రీ సర్వే పనులు కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆయనతో పాటు ఆర్ఐ లక్ష్మణనాయుడు ఉన్నారు.

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

కొమరాడ: నిర్ణీత గడువులోగా పిల్లలకు టీకాలు వేయాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని చంద్రంపేట గ్రామంలో టీకా కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. యువిన్ పోర్టర్ గమనించారు. పూర్తి చేసిన ప్రతీ టీకా వివరాలు అదే రోజు ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. గర్భిణులతో మాట్లాడి ఆరోగ్య స్థితి తెలుసుకున్నారు. గర్భిణులు బాలింతలు పౌష్టికాహారం సరిగ్గా తీసుకోవాలని తద్వారా వారితో పాటుగా పిల్లల ఆరోగ్యం కూడా మెరుగ్గా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యాలయ డెమో వై.యోగీశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది ప్రమీల, అనూష, అంగన్‌వాడీ సిబ్బంది అనూరాధ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాల బారిన పడొద్దు

గుమ్మలక్ష్మీపురం: సైబర్ నేరాల బారిన పడకుండా యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎల్విన్‌పేట ఎస్ఐ బి.శివప్రసాద్ అన్నారు. మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీ విద్యార్థులకు బుధవారం ఆయన సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్‌ను వచ్చే ఓటీపీని చెప్పడం వలన బ్యాంకు ఖాతాలోని నగదును దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు అనేక రకాలుగా నమ్మిస్తుంటారని, అటువంటి వారి మాయమాటలకు లొంగకూడదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

అపరాధ రుసుం తప్పదు

పాలకొండ రూరల్: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే అపరాధ రుసుం చెల్లించక తప్పదని ఏఎస్సై నారాయణరావు స్పష్టం చేశారు. పాలకొండ - విశాఖ, సీతంపేట, వీరఘట్టం రహదారులతో పాటు పట్టణంలో పలుచోట్ల బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం మత్తులో డ్రైవింగ్ చేసే వారిని పరీక్షించి అపరాధ రుసుం విధించారు. అలాగే గతంలో ఉండే పెండింగ్ చలాన్‌లను కట్టించారు.

ఫారంపాండ్స్ ఆవశ్యకతపై అవగాహన

పాలకొండ రూరల్: గ్రామ స్థాయిలో రైతులు సాగునీటి ఎద్దడిని సమర్థవంతంగా అధిగమించే క్రమంలో నీటి కుంటల (ఫారం పాండ్స్) ఆవశ్యకతను రైతులు గుర్తించాలని ఎంపీడీఓ వీవీ రంగారావు అన్నారు. మండంలోని మల్లమ్మగూడలో నీటి కుంటల తవకాలను ఉపాధి ఏపీఓ ఈశ్వరమ్మతో కలిసి బుధవారం పరిశీలించారు. ఉపాధి పనుల్లో భాగంగా తవ్వుతున్న నీటి కుంటల తాజా పరిస్థితులపై ఆరా తీశారు.

విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన

గరుగుబిల్లి: విద్యార్థులకు మెరుగైన బోధనను అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి డా. నల్ల తిరుపతినాయుడు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని నాగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన స్కూల్‌కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పనితీరును మెరుగుపరుచుకోవాలన్నారు. మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించాలన్నారు.

జనం కోసం జగన్...

- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం
- జెండాలు ఎగురవేసిన నాయకులు



గరుగుబిల్లి: ఖడ్గవలస జంక్షన్ వద్ద వైఎస్సార్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పుష్పశ్రీవాణి తదితరులు



గరుగుబిల్లి: బైక్‌లపై ర్యాలీగా పార్వతీపురం వెళ్తున్న కార్యకర్తలు, నాయకులు



పాలకొండ: జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేస్తున్న కళావతి, పార్టీ నాయకులు

పాలకొండ: ప్రజాసేవ కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన జగన్ మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు స్థానిక వైఎస్సార్ కూడలిలలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్నివర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించిందని తెలిపారు. పార్టీ ఆవిర్భం నుంచి పార్టీ వ్యవస్థాపకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక పల్లె ముంగిటకు పాలన తీసుకువచ్చారని కొనియాడారు. సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల వారికి అందించారని చెప్పారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షలు, వేధింపులు తప్ప ప్రజలకు చేసిన మంచి లేదని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీప పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మధరావు, మండల అధ్యక్షుడు కనపాక సూర్యప్రకాశరావు, పార్టీ నాయకులు వై. లిల్లీపుష్పనాథం, పాలవలస ధవళేశ్వరరావు, దుప్పాడ పాపినాయుడు, కోట అజయ్‌కుమార్, కడగల రమణ, తుమ్మగుంట శంకరరావు, నీలం సత్యంనాయుడు, కిల్లారి మోహన్, పాల్గొన్నారు.

భామినిలో..

భామిని: వైఎస్సార్‌సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో పార్టీ నాయకుడు రొక్కం రమేష్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించి, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, తోట లాల్, పోతల హరికృష్ణ, పత్తిక సింహాచలం, కార్యకర్తలు పాల్గొన్నారు. కాట్రగడ-బి, బాలేరు, కోసలి, బత్తిలిలో కూడా ఆవిర్భావ దినోత్సవాలు జరిగాయి.

ఘనంగా..

సీతంపేట: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ బి.ఆదినారాయణ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎ.కళావతి, బాపయ్య, మండల నాయకులు ఎస్.రాము, ఎస్.మహేష్, ఎస్.సాయికుమార్, జి.ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ

- మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని ఖడ్గవలస జంక్షన్‌లో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పుష్పశ్రీవాణి మాట్లాడుతూ ప్రజల సమస్యల పట్ల నిరంతరం వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత దేశంలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసి ప్రజలను భయాందోళనకు గురిచేస్తుందన్నారు. అనంతరం పుష్పశ్రీవాణి ఆధ్వర్యంలో ఖడ్గవలస జంక్షన్ నుంచి పార్వతీపురం కలెక్టర్ కార్యాలయానికి బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. అక్కడ యువత పోరులో పాల్గొన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, జియ్యమ్మవలస, కురుపాం మండలాల కన్వీనర్‌లు కె.దీనమయ్య, డి.జనార్ధన్ నాయుడు, కోట రమేష్, ఇంటికుప్పల గౌరీశంకరరావుతో పాటు అన్ని మండలాల నుంచి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



భామిని: భామినిలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



భామిని: కాట్రగడ-బిలో నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సీతంపేట: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నేతలు

మైనింగ్ తవ్వకాలపై ప్రజాగ్రహం

- లారీలను అడ్డుకున్న మహిళలు
- పట్టించుకోని అధికారులు



పెదగుడబ రహదారి వద్ద లారీలను అడ్డుకొన్న మహిళలు

గరుగుబిల్లి: మండలంలోని చినగుడబ రెవెన్యూ పరిధిలో అత్యం మైనింగ్ క్వారీ నిబంధనలకు విరుద్ధంగా వాహనాల రాకపోకలు సాగిస్తుండడంతో దుమ్ము ధూళి రేగి నిత్యం అవస్థలు పడుతున్నామంటూ పెదగుడబ మహిళలు తమ కుటుంబ సభ్యులతో కలసి లారీలను బుధవారం అడ్డుకున్నారు. క్వారీ నుంచి మెటీరియల్‌ను రహదారి గుండా రాకపోకలు చేయడం వల్ల దుమ్ము ధూళి ఇళ్లలోకి చేరుతుందని, తామంతా శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నామని వారు పేర్కొన్నారు. క్వారీ యజమానులు ఇచ్చిమెచ్చినట్టు మెటీరియల్‌ను తరలిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఇబ్బందులు అధికారులకు తెలియజేసినా పట్టించుకోకుండా అత్యం మైనింగ్ యజమానులకు వత్తాసు పలుకుతున్నారన్నారు. తమ ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఇదిలా ఉండగా లారీలను అడ్డుకున్న విషయం తెలిసి ఎస్ఐ పి.రమేష్‌నాయుడు సిబ్బందితో కలిసి వెళ్లి ప్రజలను సముదాయించారు. లారీలను అడ్డుకోవడం సరికాదని, ఇబ్బంది ఉంటే ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతామని చెప్పడంతో మహిళలు శాంతించారు. లారీలు యథావిధిగా రాకపోకలు కొనసాగించాయి. ఇదిలా ఉండగా క్వారీ యాజమాన్యం చేస్తున్న అక్రమాలను అధికారులు నియంత్రించే వరకు ఆందోళన కొనసాగిస్తామని మహిళలు హెచ్చరించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన..



పాలకొండ మండలం బడ్డుమాసింగి గిరిజన సంక్షేమ ప్రభుత్వ బాలికల పాఠశాలలో పాలకొండ ఫైర్ ఆఫీసర్ జామి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యుత్ పరికరాలు అగ్ని ప్రమాదానికి గురైనప్పుడు చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. వంటకు ఉపయోగించే లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ వినియోగం, నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంవీఎన్ చలపతిరావు, సైన్స్ టీచర్ సుబ్బలక్ష్మి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

– పాలకొండ రూరల్

సంస్కృతీ, సంప్రదాయాలు కాపాడుకోవాలి..

- నాబార్డు డీడీఎం దినేష్‌కుమార్



మహిళా రైతుకు జ్ఞాపిక అందజేస్తున్న నాబార్డు డీడీఎం, తదితరులు

సీతంపేట: ఆదివాసి సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి (డీడీఎం) దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని నౌగూడలో ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మహిళా సాధికార వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర ప్రాంతాల నుంచి ఎవరైనా వచ్చి రీసెర్చ్ చేసినపుడు ఆదివాసీ కల్చర్ ఉట్టిపడేలా ఉండాలన్నారు. రాబోయే తరాలకు గిరిజన సంస్కృతిపై అవగాహన పెంపొందించేలా వ్యవహరించాలని సూచించారు. గిరిజనులు పండిస్తున్న వివిధ రకాల పంటలను మార్కెటింగ్ చేయడానికి బ్రాండింగ్ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీడీఓ గీతాంజలి మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. అనంతరం మహిళా వ్యవసాయ రైతులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. సీనియర్ సైంటిస్టులు అనూష, ఎస్.లక్ష్మీనారాయణ, ఏపీఎం పార్వతి, మన్యం సహజ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సీఈఓ బి.శంకరరావు, వెలుగు ఏపీఎం పార్వతి, బీటీడీ వరహాలమ్మ, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎల్.సందీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

సీతంపేట: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు. మల్లి ఆశ్రమ పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపరాదని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.నారాయుడు, ట్రైనీ ఎస్సై శిరీషా, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అకడమిక్ ఆడిట్ జరిగింది. పాలకొండ, ఎస్.కోట కళాశాలలకు చెందిన లెక్చరర్లు బి.రాజు, భాస్కరరావు సీసీఈ అకడమిక్ ఆడిటర్లుగా పాల్గొని 2023-24, 2024-25 సంవత్సరాల రికార్డులు పరిశీలించారు. ఆడిట్ అంశాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం, వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఈఓకు సన్మానం

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏలో డిప్యూటీ ఈఓగా పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించిన యు.జ్ఞానప్రకాష్‌ను బుధవారం మండలంలోని టిక్కబాయి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల వద్ద పలువురు ఉపాధ్యాయులు సన్మానించారు టిక్కబాయి ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న జ్ఞానప్రకాష్ డిప్యూటీ ఈఓగా పదోన్నతి పొందడంతో ఉపాధ్యాయ సంఘాల కోర్ కమిటీ చైర్మన్ పి.దేవానంద్, ఉపాధ్యాయులు ఆర్ఎస్ దుర్గాప్రసాద్ తదితరులంతా అభినందించారు. గిరిజన విద్యాభివృద్ధికి మరింత కృషి చేయాలంటూ సూచనలు చేశారు.

రైతులు శాస్త్రవేత్తలుగా మారాలి

గరుగుబిల్లి: రైతులు శాస్త్రవేత్తలుగా మారాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖరాజు పేర్కొన్నారు. మండలంలోని దళాయివలసలో మెంటర్స్, ఫార్మర్ సైంటిస్ట్‌లతో బుధవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆధునిక వ్యవసాయ పద్ధతులను జోడించి మేలు రకాల విత్తనాలు వేసేటట్లు అధిక దిగుబడులు సాధించేలా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆచరించాలన్నారు. నిరంతరం ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ప్రకృతి వ్యవసాయ విధానాలను అలవర్చుకోవాలన్నారు. జట్టు వ్యవస్థాపకులు డి.పారినాయుడు, డీపీపీ ఎం.మానస, సిబ్బంది ఎం.నూకంనాయుడు, జి.అన్నపూర్ణ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



కురుపాం ఆశ్రమ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు సూచనలిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు టెన్త్ విద్యార్థులతో అన్నారు. కురుపాంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను బుధవారం సందర్శించారు. పబ్లిక్ పరీక్షలు రాసేందుకు సిద్ధపడుతున్న టెన్త్ విద్యార్థుల వద్దకు వెళ్లిన ఆయన పరీక్షలంటే భయం వీడాలని, ఇష్టపడి చదివితే సబ్జెక్టులు సులువుగా అర్థమవుతాయని, తద్వారా పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చునంటూ పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. ఆయన వెంట ఏటీడబ్ల్యూఓ చంద్రబాబు, హెచ్‌ఎం గోవింద్, వార్డెన్ కందుల సూర్యనారాయణ, పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు

- సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్

గరుగుబిల్లి: రెవెన్యూ సమస్యలు పరిష్కరించడంలో సిబ్బంది తాత్సారం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. దళాయివలసలో నిర్వహిస్తున్న రీ సర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ భూములను గుర్తించి, వాటిని పరిరక్షించాలన్నారు. ప్రజా సమస్యల వేదికలో వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.బాల, ఆర్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం



తాడికొండలో జ్వరపీడితుడితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

గుమ్మలక్ష్మీపురం: జ్వరంతో బాధపడే వారికి పీహెచ్‌సీలో చేర్చుకొని మెరుగైన వైద్యం అందివ్వాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ పద్మావతి అన్నారు. మండలంలోని తాడికొండ గ్రామాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందిన, పొందుతున్న రోగులతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితులు, ఆస్పత్రుల్లో అందించిన వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం తాడికొండ పీహెచ్‌సీని కూడా సందర్శించి రికార్డులను, మందులు, వాటి నిల్వలను తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉన్నందున.. గ్రామాల నుంచి వచ్చే రోగులకు ఆస్పత్రి వద్దే వైద్యం అందివ్వాలని, అత్యవసరమైతేనే ఉన్నత ఆస్పత్రికి రిఫర్ చేయాలని వైద్యులు ఎం.బుద్ధేశ్వరరావు, పి.అభిలాష్‌లకు సూచించారు. అనంతరం ఆమె భద్రగిరి సీహెచ్‌సీని సందర్శించి తాడికొండ గ్రామం నుంచి వచ్చి చికిత్స పొందుతున్న జ్వరపీడితులతో మాట్లాడారు. ఈమె వెంట భద్రగిరి సీహెచ్‌సీ వైద్యులు రవికుమార్, సీహెచ్ఓ పద్మ, హెచ్ఎస్ శ్రీను తదితరులున్నారు.

పాఠశాల స్థలంలో పూరిళ్లు



పాకలు వేస్తున్న గిరిజనులు

భామిని: భామిని సమీపంలో ఆదివాసీ గిరిజనుల సాగులో ఉన్న సర్వే నంబర్ 336లో 36 ఏకరాల భూమిని 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏకలవ్య స్కూల్ భవనాల నిర్మాణం కోసం సేకరించింది. దీనికి ప్రత్యామ్నాయంగా గిరిజన రైతులకు ఎకరం భూమి, ఇంటి నిర్మాణానికి 10 సెంట్లు స్థలం ఇప్పిస్తామని అప్పటి పీఓ శివశంకర్ ఆదివాసీ గిరిజనులను ఒప్పించారు. ఇంతవరకు వారికి ఎలాంటి భూమి కేటాయించ లేదు. పాఠశాల ప్రహరీ నిర్మాణానికి గిరిజన సంక్షేమశాఖ అధికారులు సమాయత్తం కావడంతో గిరిజనులు పాఠశాలకు కేటాయించిన స్థలంలో బుధవారం పూరిళ్ల నిర్మాణానికి భూమి పూజచేశారు. పాకల నిర్మాణాన్ని తలపెట్టారు.

అందుబాటులోకి రానున్న సమీకృత హాస్టల్ భవనం..



వీరఘట్టం మండల పరిషత్ కార్యాలయం పక్కనే నిర్మిస్తున్న సమీకృత బాలికల వసతిగృహ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఈ ఏడాది జూన్ నెల నుంచి ఈ వసతిగృహం అందుబాటులోకి రానుందని యంత్రాంగం చెబుతున్నారు. వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్‌తో పాటు బాలికల ఉన్నత పాఠశాలల్లో చదివే బాలికలకు ఇక్కడ వసతి కల్పించనున్నారు.

- వీరఘట్టం

అవగాహన..



భామిని మండలం బత్తిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఆర్. వెంకటరమణ అధ్యక్షతన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నిపుణ భారత్ విధానంపై ఎంఈఓ వి.భాస్కరరావు అవగాహన కల్పించారు. అలాగే వెనుకబడిన విద్యార్థులను మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై డీఆర్‌పీలు శంకరరావు, వి.ధనుంజయ, ఎన్.రాజశేఖర్ వివరించారు. సీఆర్‌పీ చిన్నబాబు, కాంప్లెక్స్ సెక్రటర్ ఎన్.సుశీలా, టీచర్లు ఉన్నారు.

- భామిని